అన్నంక రూాలె. గని ఆ నడీడు బిహారి మనిషి లేసి ''జర ఇదర్ ఆయియె'' అంట ఆ నల్ల కోటు చెవుల ఏంవూాదెనొగని ఆయిన సిత్రగుప్తుని రూపిడ్సి నారదమునోలె నగు కుంటవాయె!

ఇంగ నాముందలున్నోండ్లల్ల వయిసు పోరగాడు సెవులల్ల ఇస్పీకరి పెట్టుకోని 'ఏం ఇనవడ్తుండదొ ? ఏందొగని తమాసగ వూక్కుంట, తూక్కుంట, నెమురేస్తున్న గొడ్డు మైమర్శి యాదో లోకంల వున్నట్లు గండ్ల వడవట్టె.

ఆపిల్లగాణ్ణి జూస్తున్నకొద్ది, నామనుసూ, బుద్ధి రొండు నన్నిడ్సి ఆపిల్లగాణికి ఇని పిస్తున్నమర్మమేందో ? కండ్లరమోడ్సి ఇంతసుకానుభవం పొందుతుండడు ? తెల్సుకుం దమంట ఆవలీవల వడ్తుండది. కడాకు వుండవట్టలేక, ఎన్కముందైతున్న మనుసుకు దైర్నం జెప్పి, నేను వల్కరిచ్చి అడ్గితె తప్పొండది. ఈపిలగాణికి అమమ్మసొంటి దాన్నంట నాకు నేను తీర్మానం జేస్కోని

''బాబూ ! ఈ మిషన్ల నీకేం ఇనిపిస్తుండదయ్య ? అంతసొక్కిపోతుండవు? అంట అడిగేది అడుగంగనె, సట్కున తన నెత్తిమీదికెళ్ళి ఆ సట్రాన్ని దీసి నా చెవులకు దగిలిచ్చుకుంట ఇంగనీవె యిను అంట జెప్పె'' ''అమ్మో! ఇంగేముండది ? ఆరొండు కొయ్యేలు నా సెవుల జొరంగనె ఈ ఇనిపిస్తున్న పాట ఆరు పదులు సెల్లిన ముసలమ్మను నాకే మెట్టొర్సు దొక్కాల్నన్నంత ఉల్లాసం పొర్లి పొర్లి ఉబుసు కొస్తుంటె ? ఇంగ ఉడ్కు నెత్తురు వుర్కులు వెట్టక ఏంజేస్తది ?

పయినం సాగినకొద్ది కలెగల్పులెక్కువై ముచ్చట్లు ధరలు, పన్నులు, సర్కారు, సాదులుసన్నాసులు, భూమి, ఆకాశం అన్నిటిని హిరణ్యాక్షుడు ఎన్కటికి భూమిని సాప సుట్టోలె జుట్టిసంకన వెట్టినట్లు సాగవట్టె. నడుంగల ఆమ్మెటోండ్ల గంపలకెళ్ళి సన్న సేవు బొంగులు పుట్నాలు గల్పిచేసి నిమ్మకాయ పిండి ఇస్తున్న తిండి సామాను ఒగరు గొనుక్కోని 'లేవ్‌భాయి సాబంట నల్గురికి వంచుకుంట అంత ఒక్కకుటింబ మోలె వుండవట్టిన్రు.

యాదొ ? ఇస్టేషన్ రాంగనె 'మీల్స్ టికట్', మీల్స్ అంట ఇరువై రూపాలిచ్చి నోళ్లకు తట్టేలల్ల అన్నాలు దేవట్టిరి. మేంగుడ మాతెచ్చుకున్న సద్ది ముల్లె యిడ్సుకోని తినవడ్తిమి, గని

మామముందలున్న ఆడి మనిషిని జూసి బొగ్ర గిగ్ర అఖండంగ వున్న మనిషి 'నికాలో' అంట హుకుమిచ్చె, 'ఆమె ఈ మనిషి శరీరం తనకెక్కడ తాక్తదో ? అన్నంత యావగింపుతోటి వొంగి వోసిన్నపాటి తస్తరి దీసి అందుట్ల వొడ్డన జేసిసేతికందిచ్చె, ఈ పెద్దమనిషి పురాగ ఆమె మీద పడ్డట్ల వొంగుకుంట మీద దగిలిచ్చిన నీళ్ల బాటిలి అందుకోనికెవాయె, ఆమె ఇంగింత మూలకు జర్గి నల్లోలె నత్కి ఆవలికి జూడవట్టె, పిలేట్ల వెట్టింది సాపుజేసి ఈత్యాప ఆమెను విల్వకుండ తానె కిందికి వొంగి ఏందో డబ్బ దీస్కోని తినవట్టె.

ఇదంత జూస్తున్న నేను వూకోక 'నీవుగుడదిన రాదమ్మ' అంట అనెట్యాళ్లకు ఆయ్న 'వొబాద్మె ఖాతె ' అంట నాకు సగజెప్ప. అప్పుడు నాకనిపిచ్చింది. ఈడోగాని జోడు, ఇద్దరికి ప్రాణగండమె, మనుసు లేని సేవ, ఎట్టి సాకిరోల్నెవుంటది, నగివుర్వని సంసారం ఏంది? నర్కం గాకపోతె ? ఎడ్మసేయి దిక్కున్నజంటనేమొ తాక్కుంట, తగులుకుంట, వోర సూపులు జూసుకుంట, రుచులు మెచ్చుకుంట, సిగ్గులు సింగారిస్తె నగులు వొడ్డిచ్చుకుంటవుండరు.

ఈణ్ణేమొ ఈమె పాపం, యాదో ? మైల, రొంపి యాడ తనకు అంటుకుంటదో ? ఎట్ల బరిచ్చాలె ? అన్నంత బుగులు తోటి దూర దూరంగ జర్గుతుండది. ఆ పెద్దమనిషి సిలక్ అంగి గిన బాగనె దొడ్గిండు బండాలం వున్నోడె గని, బండాళం వయసుపోరి మనుసును గొంటాది? వుత్తమాట ! యాదొప్పాదది, దిక్కులేంది వుద్ద రిస్తనంట జేస్కున్నడొ ? తెచ్చుకున్నడొ ? ఇద్దరి జీవితాలను ముడేసి తరాలను వెంచె పెండ్లి వాని వొడికం దప్పిన్నాడు శాపమోలె తయారై ఇద్దరికీ యమలోకం బూమ్మీదనె జూపిస్తది- అంట అనుకుంటుంటె మళ్ల నల్ల కోటొచ్చి'' మీకు పక్కడబ్బల బెర్తు లిచ్చిన'' అంట జెప్తె వాళ్లవోయిరి. ఇంగనేను వాళ్ల మాటమర్శి సన్నదుప్పటిరేకు కాళ్ల మీదేస్కోని కండ్లు మూస్కోని పండుకుంటి-

ఇంగతెల్లారి ఏవంత సెప్పుకోదగ్గ ముచ్చెట్లు జర్గలేదు. మేం దిగవల్శిన ఇస్టేషన్ రాంగనె దబ దబ ముల్లెలు వట్టుకోని దిగినం. మావోండ్లు నన్ను ముల్లెమోయనియ్య లేదు. ఆయంత కాలోసెయ్యో బెణ్కితె ముల్లోలె నిన్నుమెయ్యాలె తల్లి ! నీవు బద్దురంగ దిగు సాలు అన్నరు. అవును ఎవరికీ బరువు గానద్దను కుంట నడ్సిన.

# నా తిరుగు పయినం ( చిత్రం - 2 )

మళ్ల తిరుగు పయినం రొండోనాడె ! ఈ త్యాపగుడ మా ముగ్గురి టిక్కట్లు సరిగనె ఉండవి గన్క యా లొల్లి జర్గలేదు. గని డబ్బుల గూసున్నంక వో లక్షరూపాలు కర్సు వెట్టి వోపదేండ్లు పనిగట్టుకోని తిర్గినగుడ యింతటి తెలివిడి గల్గక పోయెడిది. ఈత్యాప మా ఎదురుగ వొక్కడె ఏరూరి మనిషి వుండడు,

ఇంగ అందరు ఆడోళ్లె. ఆడోళ్లంటె వుత్తుత్తోళ్లుగారు, సూడసక్కనోళ్లు సుందరి బొమ్మలు, బ్రహ్మదేవుడు సొగుసు నంత కరిగిచ్చి అచ్చుకట్లల్ల వోసినట్లుండరు, అచ్చు కట్లనంగనె అందరు ఒక్కతీరు లేరు. మూసవోసిన బొమ్మలోలె వుండరంట అనుకునేరు,. కాదు ! కానేకాదు. ఈ భూ ప్రపంచికంల ఎన్నెన్ని ? వన్నెసిన్నెలుండవొ ? ఎన్నెన్నిరూపుకాల నీకంటినీమనుసును సూదంటురాయిలెగుంజి మెస్లకుండ జేస్తవో ? అవన్ని అన్ని రంగుల పోవళ్ల తోటి జేసిన ఆన్ని వయిసుల ఆడోండ్లు వాళ్లు .

అందుట్ల వోపిల్ల ఇరువై ఏండ్ల లోపుది . దానిసొగుసు సెప్పతరంగాదు, అది దేవుడిచ్చిన అచ్చమైన సక్కదనం. రంగులు కాట్కలు కత్తరింపులు అద్దుళ్లు అంటిచ్చుళ్ల తోటి రాలేదు, ఆ అందం పోషాకు ఇప్పటి కాలాందే ఐనా పైనిండుగ కుట్టిందె పిల్లగండరువు జేసిన కంచు విగ్రమోలె వున్న, ఎన్నముద్దోలె కండ్లవడ్తుండది. రెప్పలు వాల్సి కిందికి జూస్తె రెప్పుల నీడలు అద్దాలసొంటి చెంపల మీదవడి తల్లికడుపులకెల్లి వొచ్చిన నెత్తుటి కందు గులాబి రంగులున్న 'సూరయ్యకు కల్వపూలతోర్ణాలు కట్టినట్ల కండ్ల వడ్తుండవి.

ఆపిల్లను జూసిన కొద్దికి నాకు ఎన్కటికి దమయంతమ్మ, ఊర్వశి, శకుంతలమ్మ గిట్లనెవుండిరేమొ ? అంట అనిపిచ్చింది. ఆపిల్లను జూసి ఇట్ల చిత్రపోతుండంగనె, ఇంగొ గావె వొచ్చి కూసుండె. ఇసిత్రంగ మూడడ్గుల ఎడెల్పునవుండది. నలుబై ఎండ్ల కుండొచ్చు, ఆమె జడేసోక్కలేదు, శిగెముడ్వ లేదు, ఎంటికలు కత్తిరిచ్చుకున్నది. నడి నెత్తిన అవి గుంపోలె ఎత్తుగుండవి. సూడంగనె రప్పున కంటికి గొట్టదు, లావుదప్ప, గని సింగారమంత కండ్లల్ల మూతిల్నె వుండది. నగితె నవరత్నాలొల్కుతయి. మనిషి.

వొస్తాస్త బిస్కోట్ల డబ్బ వట్టుకొచ్చి అందరికి పుట్నాలు వంచినట్లవంచె, తీసుకున్నోళ్లంత ఇంత భారి బిస్కోట్లు అన్ని మాకె ఇస్తివి, మరి? ఒగటి నీవు దిను అంట దైర్నం జేసి వాండ్లోళ్లె అంటె, ఆఁ 'మాకంపిన్ల కెళ్లి లారెడొచ్చినవి. నేనో మూడుపుట్కాలు నింపుకొచ్చిన ' అంట బిస్కోట్ల రుచిని నెత్తిదన్నె సన్నటి నగునగె, ఆనగు సెవుల మీద వడెనొ? ఏందోగని సెవులకు వెట్టిన సొకం వజ్రాల, కర్నెపూలు నడుంగులున్న గరుడపచ్చల పచ్చదనానికి కండ్లు మిరుమిట్లు గొల్పంగ మెరిసె.

అది జూసి నేను ఈయమ్మ, మెళ్ల ఇంగేం సొమ్ము వెట్టిందొ? అంటపారజూస్తి, మెళ్లయాసొమ్ము, సొవందంలేదు, ఏళ్లకు యాదొ ? వుంగరం వుండది, సేతులు జూస్తే, గాజులు, కడాలు, కంకుణాలు గిన యావి లేవు. కుడిసెయ్యికి మట్టుకుగడియారం వుండది. దాన్కి తెల్లటి నానోలె పట్టివుండది. అదిజూసి ఇంత బండాలం వున్నమ్మ ఎండి పట్టి వెట్టుకున్నది సోకేమె ?అంట అనుకుంటుండంగనె సెయ్యి ఎన్కకు దిప్పి దస్తితోన మొకం తుడ్సుకున్నప్పుడు ఆ తెల్లపట్టి రొండు కొనలకు శెన్గగింజల కంటె పెద్దవి ఇటు నాల్గు, అటునాల్గురాళ్లు చెక్కుమన్నవి. ఈ ఎన్మిదిరాళ్ల జాలు ఈ డబ్బెడు మందిని గొనెటందు కంట అనుకోని యాదో ? పొత్తు గుదురనట్ల జూసుకుంట, ఎటూతెమ్లక

ఆ తెల్లటి ఎండిపట్టిమర్మం ఏందొ ? అంట బాగ సద్వుకున్న మాపిల్లగాణ్ణి అడ్గితె, వాడు, ''అమ్మమ్మ ! అదినీవనుకున్నట్ల ఎండిగాదు, పిలాటినం, బంగారం కన్న ఖరీదు ఎక్కువంట జెప్పె. సరే ! ఈయమ్మ గురిచ్చి ఇంత ఎందుకు జెప్పుతుండనంటె ఆమె బాగ్గెం, బండాలం జూసిగాదు, ఆమెరూపుల, మాటలల్ల నడివడికంల మంది కన్నార్పకుండ జూసె వోలక్షిణం వుండది. నగుకుంటున్న గని ఎర్రితేదు, పోకడ లేదు, అందట్ల గల్సి నట్లున్న గని గంబీరం ఆవగింజంత తప్పదు, అందర్ని నిలవెట్టె రాజసం వుండది. ఇవన్ని ఒగ ఎత్తు ఆమె భారిబుద్ధి నల్గురికి వెద్దం అన్న దర్మగుణం వోఎత్తె. ఈడ్కి వొచ్చినంక గుడ నన్ను ఆమెను మర్వకుండజేసింది. లక్ష్మీదేవి దర్మగుణం రొండు కలెగల్పుగ నడుస్తుండవి గన్కనె ఆ మొకాన అంత కళ! అంతదెశ!

వీండ్లగుంపుల్నె ఇంగో ఆలు మొగుండ్ల జంటగూసున్నరు. కలిగిన కుటింబెమె ? అయితేంది ! అంత లేకి బుద్ధి. ఆ డబ్బ లెక్కనోళ్లంత యాదో వో పదార్థం దెచ్చుకోని నల్గురు వంచుకున్నరు. తీస్కోమ్మంట డబ్బ నో ? పళ్లెమొ ? వీండ్ల ముందలవెట్టె వొక్కటికి రొండు దబ్బ దబ్బ మొగడూ పెండ్లాం అందుకోని నోరువుూస్కోనె కండ్ల

వడకుండ బర్పటిచ్చి మింగి మళ్ల రొండోముల్క అందుక తిన్నరు. తింటె తిర్రి! కడ్పాత్రం! రాత్రి దిన్నరొ? లేదో? గని! తాము వోడబ్బ దెచ్చుకున్నరు, గద, నేతివాసన బాగనె గొట్టుండది గని ఏంలాబం? ఎంగిలిసేత కాకిని గొట్టె వొట్టు! అంత బత్కు బల్కి ఎవ్వరి కండ్లల్ల వడ్తమొ? అంట కిందికి వొంగి ఆయింత కాకి వొడ్సుక తిన్నట్ల దిని గుట గుట మంచి నీళ్ల దాగిరి! ఇంత ఉట్టిగట్టు కోని వూగులాడె తిర్రి గుణం జూసినంక నాకు ఆమె దిక్కు జూడ బుద్దిగాలేదు, అందికె, ఆమె ముక్కు, మొకం, సీర, రయికె, సింగారాల్యావి. పాటిచ్చి సూడలేదు గుణం లేక పోయినంక అన్ని అలంకారాలు దిగదుడ్వ అంట. ఇంగ వాళ్ల ముచ్చెట ఇడ్సి నాయంతల నేను గూసున్న.

ఇంత బాగ్యవంతులు ఈ మూడంత్రాల మంచె డబ్బ లెందుకు ఎక్కిన్రో అంట వో రెప్పపాటు ఆలోచనొచ్చింది, గని ఎంటనె నాబుద్ది హాజ్రి జవాబోలె వీళ్లంత ఢిల్లి కెళ్లి ఈ బెంగుళూర్ల సత్సంగ మంట జర్గె సబకు నెంబర్లెవొచ్చిన్రంట, తుర్తులవొచ్చి పొయ్యేటోండ్లకు ఎకాఎకిన అవ్వల్ దర్జ ఏక్‌నెంబరు బోగీల సోటు దొర్కుతాది? అందికె ఇందుట్ల ఎక్కిన్రు; అదిగాకుండ దీని కేమైంది? అరాబురిగ, సొంతం ఇల్లోలె ఈఇంట్ల కెళ్లి ఆఇంట్లకు నడ్సినట్ల డబ్బలన్ని దిరుక్కుంట, గలగల లొల్లి వెట్టొచ్చు, సెంగల్లో అంట ఆటిడ్పుగవుండొచ్చు! అందికెఎక్కిన్రు, అంట జెప్పింది. నేను గుడ పండుకున్న.

మాముందలున్న మూడుసొర్కెలకు సంచకరిగట్టిన ముగ్గుట్ల ఒక్కడె వొచ్చిండు, వొచ్చినాయనకేమొ, మీదినుంచె దొర్కింది, కిందిరొండిటికి రావల్శినోళ్ల రాకపొయ్యే టాళ్లకు, ఆ రాజస్తాన్ ముసలాయినగని ఎంటికెలకు రంగు గింగేసి అయిదు పదులు దాటి నట్ల గండ్లవడ్డడు. ''అయ్య నాకు కింది సీటు ఇయ్యుండి అన్నడు, ఈత్యాప టికటి కలెక్టరు జర సాదు బుద్దిగల్లోడు, అందికె పదిదాంక జూసిఇస్తనన్నడు - పదిగొట్టంగొచ్చి కింది బెర్తు ఆయినకిచ్చి, మిగిల్న రొండు ఇంగోళ్లకు ఇచ్చి పేర్ల రాసిపోయిండు.

అందరు నిద్రలు వోతుండరు. సెరిసగం రాత్రి కావస్తుండది. అప్పుడు, వో అర్సమైనదుడ్డెగాడు, సూపుడు గుర్రమోలె దిట్టంగనె వుండడు, ఇంగోజతగాణ్ణి ఎంట వెట్టుకొచ్చి, వచ్చుడొచ్చుడె నా ఫోర్టీవన్ నంబర్, ఇది, హూడేర్! ఇది నాబర్త్, లే, అప్, అప్, అంట కుస్తి పైల్వాన్, వన్, టు, అంటసిట్కెలేసుకుంట, ఎగిరనట్ల ఎగురుతుండడు. ఆలొల్లికి అందరు లేసి, సేతుల మీద నెత్తులానిచ్చి సూడవట్టిరి, నేను పై నిండ దుప్పటి సవరిచ్చుకోని సంటివిల్లోలె సూస్కుంట పండుకుంటి-

ఈసిట్కోలకు, అంగిరీజలకు, ఆరాజస్తాన్ ముసలాయిన బుగులు వట్టక ''ఈసీటు టికెటి కలెక్టరు నాకిచ్చిండు; నన్ను లే అనెదమ్మొలెవ్వరికి లేవు, నీవు వోయి ఒయినను అడ్గు అంట హిందిల పండుకోని తొన్కకుండ జావాబు జెప్పె. ఆమాటిన్న ఆంభావపు పిడ్గు ఎన్కాముందు జూడకుండ'' యూ, ఫూల్, లేస్తవా ? లేవవ ? నిన్ను ఆమాంతం ల్యావట్టి డబ్బుల కెల్లి ఇస్సేస్త'' అంట జట్టు కోడిపుంజోలె వుర్కివొచ్చె, అంతట్లకె మిషన్ కట్కి దబాయించినట్ల పండుకున్నాయిన లేసి, ''ఏం గూస్తుండవ్ ? మాట సక్కన రానియ్యి'' అనేట్యాల్లకు, ఆ పోరడు ఎదనావోలె వుర్కొచ్చి ముసలాయిన రెక్కవట్టి ఇవతలకి గుంజె ! ఆడోళ్లంత అబ్బో ! అంట లొల్లి పెట్టవట్టిరి. ఫటా ఫట్ మం చెక్కిన మొగోళ్లంత గుంపు గుంపు గూడిరి. ఈలొల్లి ఇని రైలు డబ్బెంట వొస్తున్న పోలీసాయినొచ్చి, ఏందిలొల్లి ? ఏం కుస్తీలు ! రిపోర్టు జేస్త 'అంట ఆని ! మంది దిక్కు దిర్గి అన్నలు నాకు అంగిరీజు హింది సరిగరాదు, ఉన్నవాస్తువం జర్గింది జర్గినట్ల జెప్పుండి అంట అనుకుంట ! ఏం భాయి ప్యాసింజరు బనీను వట్టినవ్ ? నీ మీదరిపోర్ట్ ఇస్త అంటుండగనె ఆపోరణి దోస్తు నగులువోయి తెగులాయె, అసలు కత బైటవడగిట్ట అని 'రమేశ్‌రా ! మనం పోదాం , బోడిసీటు ! థూ అంట ఇద్వు అనె' ఆమాటల్తోటి తెల్వి మళ్లిన ఆ పోట్లగిత్త ఏందో పెద్దర్కం జూపినట్ల ఆయినను జూస్కుంట బనీను ఇడ్సి ''యు ఆర్ వోల్డు ! యాండు ఐయాం ఎంగ్, యు ఆర్ ఎ ఫూల్ నాముందు నీ వెంత ? ఈబెర్తు నాకొద్దు ! నేను వెల్లి పోతున్న అంట హిమాకత్ జూపి దంగల్ నుండి ఆవలికి నడుసున్న పైల్వాన్ పోయినట్లవాయె.

వాన గండ్ల వాన గుర్సి ఎల్సి నట్ల డబ్బుకు డబ్బ సల్లవడె. వీడెవరా పెద్దోని కొడ్కె వుండొచ్చు, ఎంత బల్పు, ఎంత కండ కావురం? సదువుకున్నోడె ! ఏం లాభం అంట అంటుంటె అందుట్ల ఎవరొ అందుకోని ఏదన్న మందుగినకొట్టిండేమొ ? అన్ని , ఇంగోళ్ల మందుగాదు, వాసన గిట్ట గొడ్తలేదు, సారగిరైత ఇంత శక్తి, వూపువుండదు, యాదో నరాలకు బలం, వూపు ఇచ్చేడ్రగ్ పుచ్చుకున్న బాబతు. మన పోరగాండ్లు సద్వు కోని ఇట్ల పాడైపోతుండరు. యాతల్లి కడ్పు సెడ బుట్టిండొ అంట అంటుంటె !

పాపం కండ్ల నీళ్ల దాంక వొచ్చిన రాజస్తాన్ అవుమానాన్ని దిగమింగి ''నేను వొచ్చే ఇస్టేషన్ల రిపోర్టు జేస్త ' అంటుంటె-

నలుగరు గూడి ''ఎందుకు సార్ ! పోయిందాన్ని పోనియ్యండి, వో రొండు గంట లైతె దిగి పోతం ! వొక్కపట్టుండి ! అంట సమాదానం జెప్పిరి. అవునంట ఆయిన

మొకం అటు జేసి పండుకునె !

ఈ తమాస జూసి ! అయ్యో మన పిల్లలు ఎద్గుతుండ రంట ముర్వాల్న ఎగిరెగిర తెగిన పతంగులోలె కట్టు దప్పుతుండ రంట ఏడ్వాల్న అంట . నాలోపట దాగిన తల్లి వేంల్కోని ఆలోచన్ల జిక్కె. నాకన్ను అంటుకోని లేశెట్యాళ్లకు సికింద్రబాదొచ్చె, దిగి ఇంటిమొకం బడ్తిమి.

ఇవి నాపయినాల సిత్రాలు